క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



వైఎస్సార్‌ సీపీ అధ్యక్షులు జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: తాడేపల్లిలోని నివాసంలో వైఎస్సార్‌ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం జగన్‌ మోహన్‌రెడ్డిని మచిలీపట్నం పార్లమెంట్‌ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు (జంగారెడ్డిగూడెం) మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఏలూరు జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీను, బూత్‌ కమిటీ అధ్యక్షుడు చింత అనిల్‌ కుమార్‌ గౌడ్‌, మండల నాయకులు వీరవెల్లి సోమేశ్వర రావు ఉన్నారు.

గుబ్బల మంగమ్మకు ప్రత్యేక పూజలు



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మకు బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అక్షయ తృతీయ సందర్భంగా ఏలూరు, విజయవాడ, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, తాడేపల్లిగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడంతోపాటు ఆలయ ప్రాంగణం వద్దే సహపంక్తి భోజనాలు చేశారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1.01 లక్షల విరాళం



దాత సీతామహాలక్ష్మికి విరాళం బాండ్‌ పత్రం అందిస్తున్న దుర్గాప్రసాద్‌

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దెందులూరు మండలం పెరుగుగూడెంకు చెందిన రాయపాటి సీతామహాలక్ష్మి బుధవారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేయగా, ఆలయ సూపరింటెండెంట్‌ దుర్గాప్రసాద్‌ విరాళం బాండ్‌ పత్రాన్ని దాతకు అందించారు.

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో గ్రామ దేవత ముత్యాలమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని, అమ్మవారిని కోరుకున్నట్టు చెప్పారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగికి వేద ఆశీర్వచనం



నాగభూషణానికి శ్రీవారి శేష వస్త్రాని కప్పుతున్న పండితుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలో అటెండర్‌గా పనిచేస్తున్న బి.నాగభూషణం బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనను ఘనంగా సత్కరించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న నాగభూషణానికి ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. చినవెంకన్న జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో స్థానికేతరులకే ప్రాధాన్యత

రంగాపురంలో భాగవత సదనం అసంతృప్తి



సత్యనారాయణ స్వామి ఆలయంలో సంకీర్తన చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న కళాకారులు

లింగపాలెం: ద్వారకాతిరుమల దత్తత ఆలయమైన లింగపాలెం మండలం రంగాపురం శ్రీ భూ నీళా సమేత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మే 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ ఆరు రోజుల పాటు నిర్వహించే భక్తి కళా కార్యక్రమాలకు వివిధ భక్తి కళారూపాల వారు ముందే దరఖాస్తు చేసుకుంటారు. ఈ కార్యక్రమాల కేటాయింపులో స్థానికులను కాదని మొత్తం ఆరు రోజుల్లో ఐదు రోజుల కార్యక్రమాలను దూరప్రాంతాలకు చెందిన వారికే కేటాయించారు. దీంతో స్థానిక భక్తి ఆధ్యాత్మిక సేవ సంస్థ అయిన భాగవత సదనం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. బుధవారం ఆలయంలో సంకీర్తన చేస్తూ శాంతియుత నిరసన తెలిపింది.

పక్షపాత వైఖరి సరికాదు

ఈ సందర్భంగా భాగవత సదనం ఆచార్యులు శ్రీమాన్‌ తిరుక్కోవళ్లూరి శ్రీనివాస పెరుమాళ్‌ మాట్లాడుతూ లింగపాలెం మండలం ఎంతోమంది భక్తులు, భాగవతులు, కళాకారులకు నెలవై ఉందని, తమ సంస్థలోనే సుమారు 200 మంది సభ్యులు సంకీర్తన, నృత్యం, విష్ణు సహస్రనామ స్తోత్రాది పారాయణాలు, ప్రవచనం, గ్రామసంకీర్తన, కోలాటం, కూచిపూడి మొదలైన భక్తి మార్గాలలో అనేక గ్రామాల్లో భక్తి ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతూ, సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాంటి ఈ ప్రాంతంలో స్థానికులకు ఒక్కరోజే అవకాశమిచ్చి, మిగతా రోజులన్నీ విజయవాడ, పూళ్ల లాంటి స్థానికేతరులకు అవకాశం ఇవ్వడం సరికాని అన్నారు. ద్వారకాతిరుమల దత్తత ఆలయమైనంత మాత్రాన ద్వారకాతిరుమల వాళ్లకే రెండు రోజుల కార్యక్రమాలు రాయడం దేవస్థాన పక్షపాత వైఖరికి నిదర్శనమని తెలిపారు. దశాబ్దాలుగా స్వామివారిని నిత్యం సేవించుకుంటూ, సొంత ఖర్చులతో సంవత్సరం పొడవునా వివిధ కైంకర్యాలు చేసుకునేది తామేనని వివరించారు. స్థానికేతరులకు కార్యక్రమాలు ఇచ్చినప్పటికీ, కనీసం సగం కార్యక్రమాలైనా స్థానిక భాగవతులకు కేటయించడం ధర్మమని అన్నారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాల వల్ల ఆలయ వ్యవస్థపై ఉన్న గౌరవం, విశ్వాసం సన్నగిల్లుతుందని తెలిపారు. ఈ వివక్షను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని అన్నారు.

కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై షేక్‌ జబీర్‌ తెలిపారు. ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంకు చెందిన ఆర్‌ నాగవెంకట శ్రీనివాసరావు జంగారెడ్డిగూడెం పద్మ థియేటర్‌ సమీపంలోని బంధువుల ఇంటి నుంచి తన గ్రామానికి మోటార్‌ సైకిల్‌పై వెళుతున్నాడని, పద్మ థియేటర్‌ పక్కన ఉన్న చర్చి వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న మోటార్‌ సైకిల్‌ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావును స్థానిక ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై జబీర్‌ తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు తీరని అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ఆరోపించారు. వేలేరుపాడు మండలం మల్లారంలో సీపీఐ 17వ మండల మహాసభ రామవరం సర్పంచ్‌, ఉప సర్పంచ్‌ పిట్టా ప్రసాద్‌, కంగాల రమాదేవి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వనజ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌ రాష్ట్రం పహల్గాం దుర్ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం అండగా నిలవాలని, ప్యాకేజీకి అనర్హులుగా పేర్కొన్న 4,500 కుటుంబాల విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి న్యాయం చేయాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదివాసీలను ఆదుకోవాలన్నారు. జీఓ-3ను అమలు చేయాలని కోరారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎండీ మునీర్‌, కారం దారయ్య, మన్నవ యామిని, సన్నేపల్లి సాయిబాబు, బాడిశ రాము, జెవి రమణారాజు మైసాక్షి వెంకటాచారి, యర్రా మధు, బంధం అర్జున్‌, మడివి కామయ్య, పిట్టా వీరయ్య, కరాటం వెంకటేశ్వర్లు, కురిమెళ్ల వెంకటేశ్వర్లు, కరాటం సీతామహాలక్ష్మి, సోడే చిన్నమ్మ, కరక ముత్యాలు, దుర్గారావు, ప్రసాద్‌ పాల్గొన్నారు.

పీసా కమిటీలకు చట్టభద్రత కల్పించాలి



పీసా కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: పీసా కమిటీలకు చట్టభద్రత కల్పించాలని పీసా కమిటీ వేలేరుపాడు మండల ప్రధాన కార్యదర్శి ఉయిక ముత్యాలరావు కోరారు. బుధవారం వేలేరుపాడు మండలం కోయిదా గ్రామంలో పీసా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కెచ్చల మాధవరెడ్డి అధ్యక్షతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో జీఓ-3ని పునరుద్ధరించాలని, 5వ షెడ్యూల్‌ ప్రాంతంలో అక్రమ కట్టడాలని నిలిపివేయాలని డిమండ్‌ చేశారు. మే 2న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. పీసా కమిటీ సభ్యులకు సరైన శిక్షణ, చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించి, చట్టబద్ధత కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కాకా విజయ్‌, సహాయ కార్యదర్శి కంగాల గంగరాజు, కోశాధికారి పొట్ల మోహన్‌, కార్యవర్గ సభ్యులు మిడియం ధర్మరాజు, మడకం విజయ్‌, కారం మేయర్‌ కుమార్‌, తెల్లం మహేష్‌, కారం బుజ్జి, గడుపుల శివ, పండ విష్ణు, సోదే సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్‌ భూములను పేదలకు పంచాలి



పంగిడిగూడెంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: పంగిడిగూడెం గ్రామంలో ల్యాండ్‌ సీలింగ్‌ భూములు, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి సీపీఎం గ్రామ కమిటీ డిమాండ్‌ చేసింది. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద పార్టీ మండల కమిటీ సభ్యుడు ఎ.ప్రభాకర్‌ అధ్యక్షతన ధర్నా చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం జీవరత్నం మాట్లాడుతూ పంగిడిగూడెం గ్రామంలో ల్యాండ్‌ సీలింగ్‌ భూములు 300 ఎకరాలు ఉందని, ఈ భూములను పేదలకు కుటుంబానికి రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్‌ చేశారు. ల్యాండ్‌ సీలింగ్‌ భూముల విషయంలో భూస్వాములు, అధికారులు కుమ్మక్కై పేదలకు దక్కకుండా చేస్తున్నారని విమర్శించారు. పేదలకు భూ పంపిణీ చేయని పక్షంలో తామే ఆ భూముల్లో దుక్కు దున్ని సాగు చేస్తామని హెచ్చరించారు. ఈమేరకు కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు ఎం బాలరాజు, ఎం అశోక్‌ కుమార్‌, ఎం సూర్యచంద్రం, కె.సుబ్బారావు, పి.బజార్‌, ఎం కుమారి, జి.సుందర్రావు, డి.సత్యవతి, లాగు శ్రీను, లాగు బాలాజీ, డి.నాగేశ్వరరావు, జి.గొల్ల పేరంటాలు, ఎస్‌ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌ను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ధర్ముల రమేష్‌

వేలేరుపాడు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మే 2న రాష్ట్ర మన్యం బంద్‌ పిలుపును మండలంలో విజయవంతం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి ధర్ముల రమేష్‌, జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం వేలేరుపాడులో బంద్‌ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఏప్రిల్‌ 20న చంద్రబాబు పుట్టినరోజున ప్రకటించిన మెగా డీఎస్సీలో ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేశారని నాయకులు విమర్శించారు. ఐదో షెడ్యూల్‌ ఏరియా 100 శాతం రిజర్వేషన్‌ అమలుపై స్పష్టత ఇవ్వకపోవడం ఆదివాసి నిరుద్యోగులను అన్యాయం చేయడమే అని వివరించారు. ఎస్టీలకు కేవలం ఆరు శాతం, గిరిజనేతరులకు 94 శాతం పోస్టులు కేటాయించడం అంటే ఆదివాసులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వాణిజ్య, వ్యాపార సంస్థలు, హోటల్స్‌, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛందంగా మూసివేసి బందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కారం వెంకట్రావు, ధర్ముల నాగేంద్ర, నర్సయ్య ఉన్నారు.

ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, స్థలదాత దుర్గారావు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం శివారు కుమ్మరిగట్టు వద్ద ఉన్న విజయగణపతి ఆలయ సమీపంలో శ్రీ రమాసహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భక్తిశ్రద్ధలతో శంకుస్థాపన చేశారు. అర్చకుడు అనిపెద్ది రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్థలదాతలు ఆలపాటి దుర్గారావు, అనంత కోటి సత్యవాణి దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ ఆలయ నిర్మాణాలతోనే ఆధ్యాత్మిక భక్తిభావన పెరుగుతుందని అన్నారు. ట్రైకార్‌ ఛైర్మన్‌ బొరగం శ్రీనివాస్‌, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌, బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు బి.నిర్మల కిషోర్‌, ఆలయ కమిటీ ప్రతినిధులు పెనుగుర్తి సోంబాబు, కొండేపాటి రామకృష్ణ, గ్రామ పెద్దలు యాంగ్రప్రగడ సురేంద్ర, దొమ్మేటి లక్ష్మీజనార్ధన్‌ రావు, ఆలయ కమిటీ సభ్యులు కోసూరి నరేష్‌, నాగరాజు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి కూడా అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



సీతారామ లక్ష్మణ సమేత హనుమద్‌ గణాధిపతుల విగ్రహాలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవం

కొయ్యలగూడెం: గవరవరం (వెంకయ్య పాలెం) రామాలయంలో శ్రీ పట్టాభి సీతారామ లక్ష్మణ ఆంజనేయ సమేత వినాయక ధ్వజ త్రయాహిక ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7.26 గంటలకు గర్భాలయంలో దేవతామూర్తుల విగ్రహాలను బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి ఆనంద్‌ శివాచార్య శర్మ శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రతిష్ఠామూర్తులకు పూజలు చేశారు. అనంతరం నాలుగు వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సాయంత్రం ఉత్సవాలకు హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు.

విద్యుత్‌ షాక్‌తో యువకుడికి గాయాలు




గాయాలపాలైన యువకుడిని పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

ఏలూరు రూరల్‌ : ఏలూరు ఇండోర్‌స్టేడియం వద్ద బుధవారం విద్యుత్‌ షాక్‌తో యువకుడు గాయాలపాలయ్యాడు. దెందులూరుకు చెందిన ప్రదీప్‌ ఏలూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్నాడు. ఉదయం 10 గంటల సమయంలో స్నేహితులతో కలిసి ఏలూరు ఇండోర్‌ స్టేడియానికి వచ్చాడు. స్టేడియం గేట్లు మూసి ఉండడంతో గోడ దూకి లోపలికి ప్రవేశించాడు. ఆ సమయంలో చెప్పులు పడిపోవడంతో స్నేహితులు చెప్పులు లోపలకు విసిరారు. ఆ చెప్పులు పట్టుకునేందుకు ప్రయత్నించిన ప్రదీప్‌ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ తీగలపై పడ్డాడు. దీంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆసుపత్రికి వెళ్లి బాధితుడును పరామర్శించారు. పలువురు విద్యార్థులు క్లాసులకు వెళ్లకుండా స్టేడియ మూసివేసినప్పటికీ లోపలకి దూకి ఆటలాడుతున్నారని, వద్దని చెప్పిన వినడం లేదని వాపోయారు.

రాజధానికి శంకుస్థాపనలు ఎన్నిసార్లు ?

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర రాజధానికి ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేస్తారని, శంకుస్థాపనకు ప్రధాని మోదీ రావడం మరీ హాస్యాస్పదంగా ఉందని జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు ఎద్దేవా చేశారు. బూటకపు శంకుస్థాపనకు ప్రధాని మోదీ రాకతో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్‌ షర్మిలను అరెస్ట్‌ చేయడం హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు.

బెట్టింగ్‌లకు బానిస కావద్దు



బెట్టింగ్‌లపై అవగాహన కలిగిస్తున్న సీఐ, ఎస్సైలు

చింతలపూడి : బెట్టింగ్‌లకు బానిసలు కావద్దని సీఐ సీహెచ్‌ రాజశేఖర్‌ ప్రజలకు సూచించారు. ఎస్పీ ప్రతాప్‌ శివ కిషోర్‌ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర పర్యవేక్షణలో బుధవారం మిత్రమా బెట్టింగ్‌లు అంటే అప్పులు, అబద్ధాలు, అరెస్టులు అనే నినాదంతో పట్టణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బెట్టింగ్‌ వ్యసనం వ్యక్తిగత, కుటుంబ, సమాజ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. బెట్టింగ్‌కు బానిసలవుతున్న వారిని గుర్తించి వారికి మద్దతు, సలహాలు అందించేందుకు పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. బెట్టింగ్‌లపై డయల్‌ 112కి లేదా ఎస్పీ వాట్సాప్‌ నెంబర్‌ 95503 51100కు సమాచారం అందించాలని కోరారు. చట్ట విరుద్ధంగా బెట్టింగ్‌, గ్యాంబ్లింగ్‌లలో పాల్గొన వద్దని, ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి ఉద్యమ కార్యాచరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వం పాఠశాలలను 9 రకాలుగా వర్గీకరిస్తోందని, ఈ అసంబద్ధ వర్గీకరణకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్‌ ఉద్యమ పథంలో పయనించడానికి సిద్ధమౌతోందని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి వేరువేరుగా ఉంటుందని, ఇటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను మంజూరు చేయాలని, 12వ పీఆర్‌సీ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని, ఐఆర్‌ ప్రకటించాలని కోరారు. 11వ పీఆర్‌సీ ఆర్థిక బకాయిలతో పాటు అన్ని రకాల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తూ రాష్ట్ర సంఘం మూడు అంచెల ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందని తెలిపారు. ఇందులో భాగంగా మే 5న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని, మే 9న జిల్లా కేంద్రాల్లో ధర్నా, మే 14న విజయవాడలో రాష్ట్ర స్థాయిలో ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంల్లో ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

భీమడోలు: బాల్య వివాహాల రహిత జిల్లాకు కృషి చేయాలని క్రాఫ్‌ జిల్లా కో-ఆర్డినేటర్‌ ఆర్‌.వినోద్‌కుమార్‌ అన్నారు. గుండుగొలను, పూళ్ల గ్రామాల్లో చైల్డ్‌ రైట్స్‌అడ్వకేసి ఫౌండేషన్‌, క్రాఫ్‌ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అక్షయ తృతీయ నాడు బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవడానికి సామూహిక అవగాహన ప్రచారాన్ని నిర్వహించారు. క్రైస్తవ, హిందు ఆలయాల వద్ద సర్వమత పెద్దలతో కలిసి బాల్య వివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేశారు. గుండుగొలను గ్రామంలో ఫాదర్‌ కాకి చార్లెస్‌ మాట్లాడుతూ మా దేవాలయంలో బాల్య వివాహాలు చేయబోమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తానే 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌ చేస్తానన్నారు.

వడదెబ్బ మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్‌): ఉపాధి హామీ పనిచేస్తూ చనిపోయిన పెంకి వెంకన్న కుటుంబానికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం జీవరత్నం, పి.రామకృష్ణలు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం కుక్కునూరు గ్రామంలో పెంకి వెంకన్న వడదెబ్బ తగిలి చనిపోయాడని తెలిపారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ, ఎస్సైలు

లింగపాలెం: అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా ఉన్నత చదువులు చదివి విజయం సాధించాలని సీఐ రాజశేఖర్‌ యువతకు సూచించారు. మంగళవారం రాత్రి యడవల్లి పంచాయతీలో ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్నబాబుతో కలిసి ఆయన పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. యువత అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సీఐ సూచించారు. గ్రామాభివృద్ధిలో భాగస్వాములై ఆదర్శంగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పంచాయతీ సర్పంచ్‌ కట్టుబోయిన రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య విగ్రహ ఏర్పాటు



కొల్లూరి విశ్వేశ్వర రావు విగ్రహం

కొయ్యలగూడెం: ప్రముఖ దాత దివంగత కొల్లూరి విశ్వేశ్వరరావు విగ్రహాన్ని బుధవారం స్థానిక గవర్నమెంట్‌ ఆసుపత్రికి ఎదురుగా జాతీయ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న స్థలంలో సర్పంచ్‌ ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. కొయ్యలగూడెం అభివృద్ధిలో విశ్వేశ్వరయ్య కృషి ఎంతగానో ఉందని, ఆయన చేసిన దానాలు సుమారు రూ.500 కోట్లు ఉంటుందని సర్పంచ్‌ విజయకుమారి పేర్కొన్నారు. ఎంతో విలువైన ఆస్తులను ప్రజలకు, ప్రభుత్వ కార్యాలయాలకు విరాళంగా అందించారని వివరించారు. విగ్రహ ప్రారంభోత్సవంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు

రాయితీపై జీలుగు విత్తనాలు సిద్ధం



రైతు సేవా కేంద్రం వద్ద జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్‌: జీలుగు విత్తనాల సాగు వల్ల భూసారం పెరుగుతుందని, ఎరువుల ఖర్చు తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు అన్నారు. పోలవరం మండలంలో 50 శాతం రాయితీపై జీలుగు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పోలవరం, గూటాల, పట్టిసీమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో 100 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు తమ ఆధార్‌ కార్డు తీసుకువెళ్లి విత్తనాలను తీసుకోవాలని సూచించారు. విత్తనాలను రైతులకు రైతు సేవా కేంద్రంలో నాయకులతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుణపర్తి చిన్న, కరిబండి నాగరాజు, పాదం ప్రసాద్‌, రైతులు పాల్గొన్నారు.

చందనోత్సవం



చందనోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ సుందర సీతారామస్వామి ఆలయంలో చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు సీతా, లక్ష్మ, హనుమ సేమత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలకు చందనంతో అభిషేకించారు. గురవాయిగూడెం గ్రామస్తులైన దల్లి వారి కుటుంబాల కులదైవమైన సింహాద్రి అప్పన్నకు ప్రతి ఏటా సింహాచలంలో చందనోత్సవం నిర్వహించినప్పుడు ఇక్కడా ఆ కార్యక్రమాన్ని పూర్వికులు నుంచి నిర్వహిస్తున్నట్టు గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్త దల్లి గోపి నాగ ప్రసాద్‌ రెడ్డి తెలిపారు. ఉభయదారులుగా దల్లి వెంకటరమణ, రాజేశ్వరి దంపతులు, వారి కుమారులు ప్రదీప్‌ రెడ్డి, దుర్గాదేవి దంపతులు, జయరాంరెడ్డి, ఉమామహేశ్వరి దంపతులు వ్యవహరించారు. భక్తులు స్వామివారి దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.